క్లుప్తంగా

ఆంజనేయునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం : మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ వద్ద అరుణగిరిపై వెలసిన కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి తోమాల సేవ జరిపించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపల్లంలో వివాదాస్పద స్థలాన్ని జేసీ శ్రీనివాసులు పరిశీలించారు. మంగళవారం ఆర్డీఓ రేణుకతో కలిసి జీఎంపల్లె దళితులకు, నరసింహారెడ్డి అనే వ్యక్తికి మధ్య తగాదాకు కారణమైన భూమిని సందర్శించారు. తహసీల్దార్ పుల్లారెడ్డిని అడిగి రికార్డులు తెప్పించుకుని తనఖీ చేశారు. ఆ భూమిని జగనన్న కాలనీ కింద దళితులకు ఇంటి పట్టాలు మంజూరు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుతం హైకోర్టులో కేసు నడుస్తోందని వివరించారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

నేడు పాచిగుంటలో 'గడప గడపకు'

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : మండలంలోని పాచిగుంట సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొనే ఈకార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అన్నిశాఖ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

నారాయణవనం: పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నామని, ఈ కారణంగా మధ్యాహ్నం 1.30 గంటల తరువాత భక్తులను స్వామి దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ. ఈనెల 31 నుంచి జూన్ 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


తిరుపతి జిల్లా న్యాయమూర్తి గురునాథ్ కుటుంబ సభ్యులు

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవారిని మంగళవారం ముంబై హైకోర్టు న్యాయమూర్తి జె.సందీప్ కుమార్ సి.మోరే, తిరుపతి జిల్లా న్యాయమూర్తి ఎం.గురునాథ్ తమ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ సతీష్ మాలిక్ స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి,అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రభుత్వభూమిపై కబ్జా కన్ను


జేసీబీతో సర్కారు భూమిని చదును చేస్తున్న దృశ్యం

పాలసముద్రం : మండలంలోని ఆముదాల పంచాయతీ ఎల్ఎన్ పురం గ్రామంలో ఉన్న ప్రభుత్వభూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. జేసీబీతో చదును చేసి ఆక్రమించుకునేందుకు సిద్ధమయ్యారు. 15 రోజులుగా తమిళనాడు నుంచి జేసీబీలను తెప్పించి గుట్టలను చదును చేస్తున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఎల్ఎన్ పురం నుంచి పుల్లయ్యగుంటకు వచ్చే చెరువు కాలువను కూడా ఆక్రమించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ బాబుని వివరణ కోరగా, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. ఎక్కడైనా ఫిర్యాదు వస్తే వెంటనే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

ప్రజలకు సత్వరమే సేవలందించాలి.. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో నెరవేర్చాలి.. సంక్షేమ ఫలాలను సక్రమంగా అందించాలి.. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి.. పేదల అభ్యున్నతికి సర్కారు ప్రతినిధులుగా నిరంతరం కృషి చేయాలి.. ఇదే ధ్యేయంగా ఉత్తమ పనితీరు కనబరచిన వలంటీర్లకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఉన్నత పురస్కారాలను మరింత బాధ్యతాయుతంగా పనిచేసేందుకు దిశానిర్దేశం చేస్తోంది.


వలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

- వలంటీర్లకు నగదు ప్రోత్సాహకాలు
- బాధ్యతను పెంచే అవార్డులు
- ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా విధులు

పాలసముద్రం : ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు చేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు . అందులో భాగంగా ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున క్షేత్రస్థాయిలో నియమించారు. వారు ఎప్పటికప్పుడు తమకు కేటాయించిన కుటుంబాలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారు. సామాజిక పింఛన్లతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారు. ఈ క్రమంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం మూడేళ్లగా సేవా పురస్కారాలను అందజేస్తోంది. సేవా వజ్రకు ఎంపికైన వారికి రూ.30వేలు, సేవారత్నకు రూ.20వేలు, సేవామిత్రకు రూ.10వేల చొప్పున నగదు బహుమతులను పంపిణీ చేస్తోంది.

వలంటీర్లు కీలకం



ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు పనిచేస్తున్నారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటకే చేర్చడంతో వలంటీర్లే కీలకం. కోవిడ్ సమయంలోనూ వారు సైనికుల్లా పనిచేశారు. వారి సేవలకు ప్రోత్సాహమిస్తూ ముఖ్యమంత్రి జగనన్న ప్రత్యేక పురస్కాలు ప్రదానం చేస్తున్నారు.

- అన్నలగన్, జెడ్పీటీసీ సభ్యుడు

బాధ్యత పెరిగింది



పురస్కారాలు అందించడంతో మా బాధ్యత మరింత పెరిగింది. ప్రభుత్వం వలంటీర్లగా తీసుకుని మాకు సమాజంలో ప్రత్యేక గౌరవం కల్పించింది. నా పరిధిలో 64 కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించడం ఎంతో సంతృప్తి ఇచ్చింది. చిత్తశుద్ధితో పనిచేస్తున్న మమ్మల్ని గుర్తించి అవార్డులు ఇచ్చిన ప్రోత్సహించడం మంచి పరిణామం.

- శక్తివేలు, సేవావజ్ర, వలంటీర్

కట్టుబడి ఉన్నాం



రాష్ట్రంలోని పేదలందరికీ అన్నగా, మామయ్యగా అనుబంధాలను పంచుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సేవ చేస్తున్నందుకు గర్వంగా ఉంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా సర్వేలు చేపట్టి నిజమైన పేదలకు న్యాయం చేస్తున్నాం. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లకు సమాజంలో గర్తింపు, గౌరవాన్ని ఇచ్చారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవకు కట్టుబడి ఉన్నాం.

- ఎన్. తులసిరామ్, సేవావజ్ర, వలంటీర్

సేవలకు గుర్తింపు



ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందజేసేందుకు మా వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నాం. దళారులు ఎవరూ లేకుండా నేరుగా సచివాలయాల్లో దరఖాస్తు చేయడం , అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుబాటులోకి తీసుకురావడమే మా లక్ష్యం. మా సేవలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుర్తింపునివ్వడం ఆనందంగా ఉంది.

- పి. పవిత్ర, సేవారత్న, వలంటీర్

చిత్తశుద్ధితో రోగులకు వైద్యసేవలు


మంత్రి రోజాను సత్కరిస్తున్న సూపరింటెండెంట్ ప్రభావతి, వైద్యసిబ్బంది

నగరి : ఆస్పత్రికి వచ్చే రోగులకు చిత్తశుద్ధితో వైద్య సేవలందించాలని మంత్రి ఆర్‌కే రోజా సూచించారు. మంగళవారం పట్టణంలోని నగరి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రభావతి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి రోజాను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మంత్రి రోజా మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తున్నామన్నారు. రోడ్డు సమస్య పరిష్కరించామని చెప్పారు. రూ.5కోట్ల వ్యయంతో ఆస్పత్రిలో అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు వెల్లడించారు. రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా మందులు అందజేస్తున్నట్లు వివరించారు.

సంతృప్తికరంగా 'ఉపాధి'


మామిడి తోటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కార్వేటినగరం : నియోజకవర్గంలో జాతీయ ఉపాధి హామీ పనులు సంతృప్తికరంగా ఉన్నాయని కేంద్ర బృందం ప్రశంసించింది. మంగళవారం పెనుమూరు, కార్వేటినగరంలో సాగుతున్న ఉపాధి పనులను కేంద్ర జలశక్తి బృందం సభ్యులు సచీంద్రకుమార్ పట్నాయక్, సోమేంద్రకుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ రూఫ్‌వాటర్ హార్‌వెస్టింగ్ పనులు, మొక్కల పెంపకానికి అత్యంత ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. రూఫ్‌వాటర్ హార్‌వెస్టింగ్ వల్ల భూమిలో గతం కంటే నీటి శాతం పెరిగిందని తెలిపారు. అన్నూరు వద్ద ఉపాధి హామీ ద్వారా నాటిన మొక్కలను పరిశీలించారు. కార్వేటినగరం ఐటీఐ కళాశాల, ఎస్సీ బాలుర వసతి గృహం ఆవరణలో నిర్మిస్తున్న హార్‌వెస్టింగ్ పనులను తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించి పీడీ గంగాభవానీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెనుమూరు మండలంలో రెన్నోవేషన్ అమృత్ సరోవర్ పాండ్‌ను సందర్శించారు. అలాగే గుత్తావాండ్ల ఊరు, మటంపల్లెలో మామిడి తోటలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీడీలు శోభన్‌బాబు, సునీల్, ఎంపీడీఓ మోహన్‌మురళీ, ఏపీఓ జాహ్నవి, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ మనోహర్‌నాయుడు, విక్రమ్‌రెడ్డి, సర్పంచ్‌లు ధనంజయవర్మ, సుందర్‌రాజ్ పాల్గొన్నారు.

మరింత వేగంగా గృహ నిర్మాణాలు


సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

విజయపురం (నగరి) : మండలంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి వారికి అవసరమైన మెటీరియల్ వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులు పూర్తి చేసిన లబ్ధిదారుల బిల్లులు సకాలంలో మంజూరవుతున్నాయని వివరించారు. సమావేశంలో ఆర్డీఓ సుజన, తహసీల్దార్ వెంకట్రాయులు, ఎంపీడీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా సొమ్ము పంపిణీ


బాధితురాలికి బీమా నగదు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు విష్ణుప్రియ

పిచ్చాటూరు: మృతుడి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం కింద మంగళవారం తక్షణ సాయంగా రూ.10వేలను జెడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ అందజేశారు. అడవి కొడియంబేడు ఎస్టీ కాలనీలో నాలుగు రోజుల క్రితం రమేష్(47) అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో మృతుని భార్య సుధకు బీమా సొమ్మును అందజేసి ఓదార్చారు. మిగిలిన రూ.90వేలను త్వరగా వచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, వెల్ఫేర్ అసిస్టెంట్ దీపికను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునివేలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత నింద్ర


విజేతలకు బహుమతులు అందిస్తున్న నేతలు

నింద్ర : మండల కేంద్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అంబేడ్కర్ కబడ్డీ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారంతో ముగిసింది. నింద్ర జట్టు విజేతగా నిలవగా, కొట్టకాడు జట్టు రన్నర్స్ స్థానం దక్కించుకుంది. రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జయశ్రీ చేతులమీదుగా నింద్ర జట్టుకు ప్రథమ బహుమతి కింద రూ.15వేలు అందించారు. కొట్టకాడుకు రెండో బహుమతిగా రూ.10వేలను వైస్ ఎంపీపీ శోభ, సచివాలయ కన్వీనర్ చార్లెస్ అందజేశారు. మూడో బహుమతిగా పోస్టల్ టీమ్ తిరుపతికి రూ.7వేలను అభిషేక్, రీగన్ పంపిణీ చేశారు. నాలుగో బహుమతిగా రూ.5వేలను గోవిందప్పనాయుడు కండ్రిగ జట్టుకు మురళి శేషంబేడు, ఐదో బహుమతిగా కొప్పేడు జట్టుకు రూ.వెయ్యిని సింసోన్ అందించారు. తారాక్షి టీమ్, అంబేడ్కర్ టీమ్‌లు వరుసగా ఆరు, ఏడో స్థానంలో నిలవగా వారికి రూ.వెయ్యి చొప్పున పి.పవన్‌కుమార్, సేదు పంపిణీ చేశారు. తిరుపతికి చెందిన ఎంబీయూ జట్టు ఎనిమిదోస్థానం, మై సెలెక్ట్ సూళ్లూరు పేట జట్లకు మీరయ్య, విక్రమ్ చేతులమీదుగా రూ.వెయ్యి చొప్పున అందజేశారు. పదోస్థానంలో నిలిచిన కళత్తూరు జట్టుకు నితిన్‌కుమార్ రూ.వెయ్యి నగదు పంపిణీ చేశారు. నింద్రకు చెందిన రోమికాపెరుమాళ్, కిరణ్, మణిగండన్, మునీంద్ర, మీరయ్యరాజేష్ చేతులమీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ సరితాఅరుల్, వైఎస్సార్‌సీపీ నేతలు శ్యామ్‌లాల్, కాటయ్య, బాలాజీ, బాబు, ఎయుమలై, పాండియన్, వినాయగం, దర్మా, చిన్నరసా పాల్గొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్ఈ కృష్ణారెడ్డి


వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి వద్ద పామోలిన్ ట్యాంకర్ ఢీకొన్న 33 కేవీ లైన్ ప్రాంతాన్ని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ప్రమాదానికి కారణాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 33 కేవీ లైన్ ఏర్పాటుకు అయ్యే ఖర్చును అంచనా వేయాలని, బుధవారం నుంచి పనులు ప్రారంభించాలని ఎస్పీడీసీఎల్ డీఈ వాసురెడ్డికి సూచించారు. గ్రామాల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

యాళి వాహనంపై ఆదిదంపతుల విహారం


యాళి వాహనంపై పార్వతీ పరమేశ్వరులు


విద్యుద్దీప కాంతులీనుతున్న సదాశివేశ్వరాలయం

పుత్తూరు రూరల్: కామాక్షి సమేత శ్రీసదాశివేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి అమ్మవార్లు యాళి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అడుగడుగున భక్తులు మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ఉదయం ఆలయ అర్చకులు మురళీ గురుకుల్ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు, సభ్యులు జి.రమేష్, ఎం.ఆర్.సుందరం, ఓ.బాబు, జి.రుక్మిణి, వీఎం.వి జయలక్ష్మి, ఎస్.భరణి పర్యవేక్షించారు.

వేడుకగా గరిగె ఉత్సవం


గెరిగ ఉత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): శ్రీకాళహస్తిలో పిచ్చాటూరు రోడ్డు సమీపంలోని బంగారమ్మ కాలనీ వద్ద శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం అనుబంధ బంగారమ్మ దేవాలయం జాతర సందర్భంగా మంగళవారం గెరిగ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ, బంగారమ్మ జాతర పురస్కరించుకుని ఈ ఉత్సవాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏఈఓ లోకేష్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీహరి, సబ్ టెంపుల్స్ ఇన్‌చార్జ్ లక్ష్మయ్య, దేవస్థాన సిబ్బంది మునిరాజ, పట్టణ ప్రముఖులు భాస్కర్ రెడ్డి, జగన్నాథం నాయుడు, రాజగోపాల్ రెడ్డి, రామాంజనేయులు, ఆలయ పూజారి శ్రీనివాసులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బంగారమ్మకు సారె

శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరఫున బంగారమ్మకు ఆడబిడ్డ సాంగ్యంగా బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి దంపతులు అమ్మవారికి సారె సమర్పిస్తారని అంజూరు తెలియజేశారు. ఆ తర్వాత జాతర ప్రారంభమవుతుందని చెప్పారు. పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, పట్టణ ప్రజలు పాల్గొనాలని కోరారు.

వైభవంగా పోలాక్షమ్మకు పొంగళ్లు


పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు


విశేషాలంకరణలో అమ్మవారు

- పాదిరికుప్పంలో సందడిగా గంగమ్మజాతర

కార్వేటినగరం : మండలంలోని పాదిరికుప్పంలో మంగళవారం నడివీధి గంగమ్మ జాతర ప్రారంభమైంది. అమ్మవారికి అత్యంతప్రీతిపాత్రమైన అంబలిని తీసుకుని మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. సాయంత్రం నిప్పల పోలాక్షమ్మ ఆలయం వద్ద ఇంటికి రెండు పొంగళ్ల చొప్పున పొంగించారు. పిండి దీపారాధనలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద జ్యోతిని వెలిగించి ఊరేగింపుగా తీసుకువచ్చి నడివీధి గంగమ్మ సన్నిధిలో ప్రతిష్ఠించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలు, సుగంధభరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో విశేషంగాద అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చారు. శాస్త్రోక్తంగ రజకులు తొలి హారతి సమర్పించిన తర్వాత ఊరేగింపు చేపట్టారు. ఇంటింటా కర్పూర హారతులతో అమ్మవారికి నీరాజనాలు పట్టారు.

వైభవంగా పర్వతాల గంగమ్మ జాతర


అమ్మవారికి సారె సమర్పిస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

రేణిగుంట: మండలంలో కరంబాడి సచివాలయ పరిధిలోని తారకరామానగర్‌లో మంగళవారం వైభవంగా పర్వతాల గంగమ్మ జాతర నిర్వహించారు. రెండు రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు చేశారు. బియ్యపు ఆకర్ష్‌రెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయంలో అర్చనలు, పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

స్కూళ్లకు 'జగనన్న గోరుముద్ద' గ్లాసులు


ప్రధానోపాధ్యాయులకు స్టీలు గ్లాసులు అందజేస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: జగనన్న గోరుముద్ద పథకం కింద మండలంలోని 67 పాఠశాలలకు 4,213 స్టీల్ గ్లాసులు అందాయని ఎంఈఓ కే. రవి తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్టీలు గ్లాసులను అందజేశారు. గ్లాసులపై జగనన్న గోరుముద్ద అని కూడా ముద్రించారన్నారు. వీటిని పాఠశాలల పునఃప్రారంభం రోజు విద్యార్థులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భారతి, త్యాగరాజులు, కోటీశ్వరం, కుప్పయ్య, గౌరీశంకర్, మునికల్యాణి, శైలజ, చెంగమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.